క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, రాజవేణులు మాట్లాడారు. అన్ని క్యాడర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ను తక్షణమే విడుదల చేయాలన్నారు. జీహెచ్ఎం, ఎస్ఏ, పీఎస్‌హెచ్ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. వివిధ సమస్యలపై దశల వారీగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు జాడి రాజన్న, రమేశ్, సంజీవ్, జయకృష్ణ, కుమార్, ప్రకాష్, కిరణ్, సురేష్, చిలుక శిల్ప, నారాయణ, స్వామి, రాజేష్, సూర్యకళ, సునీత తదితరులు పాల్గొన్నారు.

'అవన్నీ తప్పుడు ఆరోపణలు'



మాట్లాడుతున్న గీతకార్మిక సంఘ సభ్యులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల గీత కార్మిక సహకార సంఘ కన్వీనర్‌గా ఉన్న గాజుల ముఖేశ్ గౌడ్‌పై తప్పుడు ఆరోపణలు చేసి కోల రాజాగౌడ్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆ సంఘ గౌరవ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సమావేశమై వివరాలు వెల్లడించారు. సంఘ సభ్యుల అందరి ఒప్పంద ప్రకారమే కల్లు దుకాణాల నిర్వహణను లీజుకిస్తున్నారన్నారు. పనిచేయని స్థితిలో ఉన్న వారికి గౌరవ వేతనం పింఛను మాదిరిగా అందరి ఆమోదంతోనే తీసుకుంటున్నారని తెలిపారు. సంఘంపై అనవసర ఆరోపణలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో లీజుదారుడు గుర్రం రాజేందర్‌గౌడ్‌తో పాటు సభ్యులు బుర్ర భూమాగౌడ్, మధూకర్‌గౌడ్, పండరి గౌడ్, సదానందంగౌడ్, నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు ట్రాన్స్‌జెండర్ల మద్దతు

జన్నారం: జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలపై ఉన్న నిషేధం ఎత్తివేయాలని సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్‌లు చేస్తున్న రిలే నిరహార దీక్షలకు మంగళవారం ట్రాన్స్‌జెండర్లు సంజన, బుజ్జి మద్దతు తెలిపారు. భూమాచారికి దండలు వేసి దీక్షల్లో కూర్చున్నారు. జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరించాలని, అప్పటి వరకు జరిగే ఆందోళనలో మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి

తాండూర్: రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని, వంటకు అవసరమైన గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని, కొత్త మెనూకి అదనంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామగిరి వరలక్ష్మి, అక్కళ్లపల్లి కమల, సరిత పాల్గొన్నారు.

'సహారా' కార్యాలయం ఎదుట ఆందోళన

నస్పూర్: కాలపరిమితి ముగిసిన డిపాజిట్ దార్లకు వెంటనే డబ్బులు చెల్లించాలని పలువురు సహారా ఇండియా డిపాజిట్ దారులు సీసీసీ కార్నర్ వద్ద గల సహారా ఇండియా కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. తమ డబ్బులు వెంటనే చెల్లించాలని, లేనియెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, బాధితులు బొద్దున దుర్గయ్య, మాచెర్ల శ్రీనివాస్, మోతె కాంతయ్య, మిట్ట రమాదేవి, తిరుపతి రావు పాల్గొన్నారు.

కేసు నమోదు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్ గ్రామం రొమ్మిపూర్‌లో మంచిర్యాల-వరంగల్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులు నిర్వహిస్తున్న మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో సరైన అనుమతులు లేకుండా డీజిల్ నిల్వలు చేయడంపై కేసు నమోదు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య తెలిపారు. తనిఖీల్లో భాగంగా మంగళవారం బంక్‌లో తనిఖీ చేయగా 8,141లీటర్ల డీజిల్ ట్యాంకులో నిల్వ చేశారన్నారు. అదనపు కలెక్టర్‌తో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, తదితరులు ఉన్నారు.

కొమ్మ కదిలిందా.. కరెంట్ గోవిందా

నీల్వాయి అటవీ ప్రాంతంలోని వన నర్సరీ సమీపంలో మల్లంపేట నుంచి నీల్వాయికి వస్తున్న 11కేవీ విద్యుత్ లైన్‌కు చెట్ల కొమ్మలు తగులుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. వేమనపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ప్రాణహిత కాలనీకి వెళ్లే విద్యుత్ లైన్ సైతం ప్రమాదకరంగా చెట్ల పొదలను తాకుతూ వెళ్తోంది. గాలి వీచినప్పుడల్లా చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లను తాకుతుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు. – వేమనపల్లి



నీటి గుంత.. ప్రయాణికుల చింత



ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటి గుంత జాతీయ రహదారిని ఆనుకొని ఉంది. ఇది దాటితేనే ప్రజలు తమ ప్రయాణాన్ని సాగించి గమ్యస్థానానికి చేరేది. మండలంలోని తాండూర్ గ్రామవాసులు జాతీయ రహదారిపైకి వచ్చి తమ ప్రయాణం సాగించాలంటే ఓ వైపు అండర్‌బ్రిడ్జిలోని నీటి ప్రవాహాన్ని, మరోవైపు జాతీయ రహదారి పెట్రోల్‌బంక్‌ల సమీపంలో రోడ్డుపై ఉన్న ఈ నీటి గుంతలను దాటాల్సిందే. దీంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. చిన్నపాటి వర్షాలకే గుంతలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలో నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – తాండూర్

షాక్ కొడుతున్న రక్షణ కంచె..!

జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రమాదాలను నివారించేందుకు రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. వాహనాలు కంచెను తగలగా, ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకొని ఉన్న రక్షణ కంచెకు విద్యుత్ సరఫరా అవుతోంది. ప్రమాదం జరగక ముందే అధికారులు రక్షణ కంచె సరిచేయాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – మంచిర్యాలఅగ్రికల్చర్



కంపుకొడుతున్న కాలువలు

- డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక
- మురుగునీరు నిలిచి దుర్గంధం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పట్టించుకోని పంచాయతీరాజ్ శాఖ అధికారులు



తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో మురికి కాలువలో ఉన్న మిషన్ భగీరథ పైపులైన్

బెల్లంపల్లి: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మురికి నీటి పారుదల సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయి. తూతూ మంత్రంగా చేపడుతుండటంతో కాలువల్లో పూడిక నిండి మురికి నీరు స్థిరంగా నిలిచిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకుండా పంచాయతీరాజ్ అధికారులు ఉదాశీన వైఖరీ అవలంభిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలో బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలు, వీటి పరిధిలో 114గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ఏ ఒక్క గ్రామ పంచాయతీ కూడా మెరుగైన స్థితిలో లేదు. పూడిక నిండిన మురికి నీటి కాలువలు, రొచ్చుగుంటలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి. నెలల తరబడి పూడిక తీయించిన పాపాన పోకపోవడంతో మురికినీటి కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా చేసే పైపులు మురికినీటి కాలువల్లో నుంచి విస్తరించడంతో ప్రమాదం పొంచి ఉంది. పైపుకు ఏమాత్రం రంధ్రం పడినా నీటి కలుషితం జరిగే అవకాశాలున్నాయని గ్రామీణులు ఆందోళన చెందుతున్నారు.

వృద్ధి చెందుతున్న దోమలు..

వర్షాకాలంలో దోమల ప్రభావం అధికంగా ఉంటుంది. దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా పంచాయతీరాజ్ అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. వీధులు, మురికి నీటి కాలువలు, ఇళ్ల పరిసరాల్లో ఫాగింగ్ చేయించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి మిన్నకుండిపోతున్నారనే విమర్శలను మూట గట్టుకుంటున్నారు. చీకటి పడగానే దోమలు ఇళ్లలో చొరబడి రొద పెడుతుండటంతో పల్లె ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇప్పటికే సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ జ్వరాలు క్రమంగా వ్యాపిస్తుండటంతో పల్లె ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు.

పర్యవేక్షణ తప్పా పట్టింపేది..?

గ్రామపంచాయతీల్లో మండల పంచాయతీ అధికారు(ఎంపీవో)ల పర్యవేక్షణ ఆర్భాటానికి సరిపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మూడు, నాలుగు రోజులకోసారి నర్సరీలను, పంచాయతీ కార్యాలయాలను సందర్శిస్తున్న ఎంపీవోలకు మురికి కాలువల దుస్థితి కనిపించకపోవడం శోచనీయం. చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడంతో పారిశుద్ధ్యం పడకేసి గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు.

బైటెక్స్ స్ప్రే చేయిస్తున్నాం

పారిశుద్ధ్యం మెరుగుదల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మురికి నీటి కాలువల్లో, రొచ్చు గుంటల్లో దోమల నియంత్రణకు బైటెక్స్ స్ప్రే చేయిస్తున్నాం. మురికి కాలువల్లో నీరు నిల్వకుండా పూడిక తీత పనులు కూడా చేపడుతున్నాం. ఎక్కడైన సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

– సబ్దార్ అలీ, డీఎల్‌పీవో, బెల్లంపల్లి

ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హనోక్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బన్సీలాల్

బెల్లంపల్లిరూరల్: ప్రజలకు నిరంతర రక్షణ కల్పించడం కోసమే గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ చందవోలు హనోక్ అన్నారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటినీ తనిఖీ చేశారు. 10లీటర్ల గుడుంబా సీజ్ చేసి చిలుముల మల్లీశ్వరిని అదుపులోకి తీసుకున్నారు. సరైన వాహన ధృవీకరణ పత్రాలు లేని 38 ద్విచక్ర వాహనాలు, 14 ఆటోలు, ట్రాలీ సీజ్ చేశారు. మావోయిస్టు పార్టీ అజ్ఞాతంలో ఉన్న జాడి వెంకటి, పుష్ప కుటుంబీలకును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్సై బండి రామకృష్ణ, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్, వన్‌టౌన్, నెన్నెల, భీమిని ఎస్సైలు రాకేష్, ప్రసాద్, విజయ్, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'కార్డన్ సెర్చ్'

వేమనపల్లి: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు చెన్నూర్‌రూరల్ సీఐ బన్సీలాల్ తెలిపారు. మండలంలోని దస్నాపూర్‌లో మంగళవారం ఎస్సై సురేశ్‌తో కలిసి ఇంటింటినీ పరిశీలించారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు గుర్తించారు. గుడుంబా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి, విద్యాభ్యాసం గురించి వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ఉపయోగాలను గ్రామస్తులకు తెలియజేశారు.

ఘనంగా గాజుల మహోత్సవం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురదగూడెం సమీపంలో గల త్రిశక్తి అష్టలక్ష్మీ, కామాఖ్య దేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, మహంకాళి దేవాలయంలో మంగళవారం శ్రావణ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గాజుల మహోత్సవం వేడుకను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజులతో అందంగా అలంకరించారు. కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు

స్పందించారు.. తొలగించారు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి పోచమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ దుస్థితిపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'వాకింగ్ ట్రాక్ కళావిహీనం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. వార్తా కథనానికి బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వాకింగ్ ట్రాక్, పరిసరాలను పరిశుభ్రం చేయించారు. బెంచ్‌ల వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. చెత్త చెదారం లేకుండా సుందరంగా తయారు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



గడ్డిని తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మలు నరికించారు..!



భీమారం: భీమారం గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో విద్యుత్ లైన్‌కు కొమ్మలు తాకుతుండటంతో చెట్టుకు విద్యుత్ సరఫరా అయింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురికాగా 'సాక్షి' మంగళవారం 'చెట్టుకు షాక్' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో విద్యుత్ ఏఈ శంకర్ స్పందించారు. చెట్టుకు తగులుతున్న కొమ్మలను నరికించి సమస్యను పరిష్కరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

బొగ్గుబాయి వార్తలు

టీబీజీకేఎస్ ఐకే1ఏ గని ఫిట్ కమిటీ ఎన్నిక

జైపూర్: జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని టీబీజీకేఎస్ నూతన ఫిట్ కమిటీని మంగళవారం ఏర్పాటు చేసినట్లు టీబీజీకేఎస్ ఏరియా ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర కార్యనిర్వహణ కార్యదర్శి అన్వేశ్‌రెడ్డి తెలిపారు. ఫిట్ సెక్రెటరీగా గడ్డం మల్లయ్యతో పాటు అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా మాధవరపు రామారావులతో పాటు ఆయా డిపార్టుమెంట్ల వారీగా నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో కంపెనీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా శాఖ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి మధూసూదన్‌రెడ్డి కోరారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిందిగా కోరారు. దీనికోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.

బీసీ ఉద్యోగులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో బీసీ ఉద్యోగులకు చట్టబద్ధ హక్కులు కల్పించాలని సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముష్కే సమ్మయ్య, పేరం రమేశ్ మాట్లాడారు. యాక్టింగ్ ఆధారిత ప్రమోషన్లలో బీసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీన్ని సవరించాలని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ప్రగతి మైదానానికి ఆయన పేరు పెట్టాలన్నారు. బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శులు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు మల్లేశ్, మనోజ్, మదన్, రాజకుమార్, అజయ్ పాల్గొన్నారు.

క్రీడలపై నిర్లక్ష్యం వీడాలి

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యం క్రీడలపై నిర్లక్ష్య వైఖరి వీడాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మంగళవారం ఒక ప్రకటనలో యాజమాన్యంను డిమాండ్ చేశారు. కంపెనీలో ఏడు సంవత్సరాలుగా స్పోర్ట్స్ ఆఫీసర్‌ను నియమించలేదన్నారు. 3సంవత్సరాలుగా క్రీడాకారులకు అందించాల్సిన క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ కిట్స్ అందించలేదన్నారు. అరకొర బడ్జెట్‌ను కేటాయిస్తూ క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కంపెనీలో ఎంతోమంది కోలిండియా, ఇతర పబ్లిక్ సెక్టార్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులున్నారని, వారి క్రీడాభివృద్ధికి కంపెనీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్పోర్ట్స్ సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, చాలా కాలంగా ఒకే ఏరియాలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం

తాండూర్/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో, తాండూర్ మండల కేంద్రంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం 22వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల మల్లేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి సూరన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు రామన్న, నాయకులు పాల్గొన్నారు.

నూతన పైప్‌లైన్ వేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని మొదటి జోన్ 17వ వార్డులోని ఫిష్ మార్కెట్ లైన్‌లో గల ప్రైవేట్ ఇళ్లకు 25ఏళ్ల క్రితం ఏరియా జీఎం నందమూరి బాలకృష్ణమూర్తి విద్యుత్, వాటర్ పైప్‌లైన్, లెట్రిన్ పైప్‌లైన్ సౌకర్యం కల్పించి లైన్ చివరన సెప్టిక్ ట్యాంక్ నిర్మించారు. ప్రస్తుతం సెప్టిక్ పైప్‌లైన్ పాడైపోవడంతో కాలనీవాసులకు ఇబ్బందిగా తయారైందని, కొత్త పైప్‌లైన్ వేసి ఆదుకోవాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతిపత్రం ఇచ్చారు.

గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

లక్సెట్టిపేట: తెలంగాణ రాష్ట్ర బ్యాండ్ కళాకారులు ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యండీ ఫీర్ మహ్మద్, తాజుద్దీన్ బాబా తెలిపారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో మంగళవారం మాట్లాడారు. బ్యాండ్ కళాకారులకు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు ఫారం నమూనాను అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

సంక్షిప్త వార్తలు

అక్రమంగా మొరం తవ్వకాలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మోదెల చెరువు సమీపంలో అనుమతి లేకుండా అక్రమంగా మొరం తవ్వుతున్నారనే సమాచారంతో ఇరిగేషన్ అధికారులు సోమవారం రాత్రి టిప్పర్, జేసీబీ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఇరిగేషన్ అధికారి ప్రణీత్ తెలిపారు. సంఘటన స్థలం వద్దకు వెళ్లి వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఇరిగేషన్ అధికారి మహేశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశానికి బీజేపీ నేతల హాజరు

తాండూర్: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే హర్‌ఘర్ తిరంగా, తిరంగా యాత్రలపై మంగళవారం హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశానికి తాండూర్ మండల బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ రాష్ట్ర స్థాయి కార్యశాలకు ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రమదేవి హాజరయ్యారు. త్వరలో చేపట్టబోయే కార్యక్రమాలపై నాయకులు, బీజేపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

14రకాల సరుకులు ఇవ్వాలి

జన్నారం: తెల్ల రేషన్ కార్డుదారులకు కేరళలో సీపీఎం, కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఇస్తున్న విధంగా 14రకాల నిత్యావసర సరుకులను ప్రతీ కార్డుదారులకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం సీనియర్ నాయకుడు బుచ్చన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీల అమలు విఫలమయ్యాయన్నారు. సమావేశంలో కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు బుచ్చన్న, సీపీఎం నాయకులు దాసండ్ల రాజన్న, అంబటి లక్ష్మణ్, పోతు విజయ, యశోద, ఆత్రం రవి, గుడ్ల రాజన్న, పర్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు

బెల్లంపల్లి/కాసిపేట: శిశువు ఆరోగ్యానికి ముర్రుపాలు ఎంతగానో దోహద పడతాయని ఐసీడీఎస్ బెల్లంపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రభావతి, ప్రసన్న, కాసిపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం బెల్లంపల్లి టేకులబస్తీ-1, హన్మాన్ బస్తీ-2 అంగన్ వాడీ కేంద్రాల్లో, కాసిపేట మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ సోమగూడెంలో వేర్వేరుగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని వారు మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని సూచించారు.

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 10మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి మధుసూధన్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శంకర్ వర్మ, రక్తనిధి కేంద్రం సూపర్‌వైజర్లు మాధవి, విజయ్‌కుమార్, సత్యవతి, మన ఫౌండేషన్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

బీమాకు ఇప్పటికీ దూరమే

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో మరికొంత మంది ఉద్యోగులు ప్రమాద బీమాకు దూరంగా ఉన్నారని డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 218మంది ఉద్యోగులు కంపెనీ సూచించిన బ్యాంకుల్లో కాకుండా ఇతర బ్యాంకుల్లో శాలరీ అకౌంట్లు కలిగి ఉన్నారని, దీనివల్ల వారు ఏదేని అనుకోని ప్రమాదం జరిగితే బీమా ప్రయోజనాలు పొందలేరన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, బ్యాంక్‌ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ల్లో శాలరీ అకౌంట్లు కలిగి ఉండాలని తెలిపింది. అనుకోని ప్రమాదం జరిగితే సుమారు రూ.కోటి వరకు వివిధ స్కీంల కింద ప్రమాద బీమా రానుంది. వెంటనే ఇందులో తమ అకౌంట్లను ప్రారంభించి కంపెనీకి సమాచారం అందించాల్సిందిగా కోరారు.